సమస్యలు విని.. పరిష్కారానికి ఆదేశించి

జగిత్యాల, న్యూస్‌టుడే: ప్రజావాణి వినతులు వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు విన్నారు. పరిష్కరించే వీలున్న వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వీలుకాని పక్షంలో సంబంధిత వ్యక్తులకు కారణం తెలపాలన్నారు. ఈ సందర్భంగా 47 వినతులు రాగా పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత శాఖలకు రాశారు. జగిత్యాల, కోరుట్ల ఆర్డీవోలు పి. మధుసూదన్, ఎన్. శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో ఎ. హన్మంతరావు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.


సమస్యలు వింటున్న అదనపు కలెక్టర్, ఆర్డీవోలు

బస్సు పునరుద్ధరించండి



జగిత్యాల నుంచి మేడిపల్లి మండల కేంద్రం మీదుగా గోవిందారం, మొత్కురావుపేట బస్సును మధ్యాహ్నం ట్రిప్పును రద్దు చేశారని పునరుద్ధరించాలని రంగాపూర్ గ్రామస్థులు కోరారు. మొత్కురావుపేట గ్రామంలో నైట్‌హాల్ట్ చేసేలా చూడాలని కోరుట్ల నుంచి ఉదయం, సాయంత్రం మేడిపల్లి మండల కేంద్రం మీదుగా నడిపించాలని కోరారు.

ఇల్లు కేటాయించరూ..



నూకపల్లి అర్బన్‌కాలనీలో తమకు రెండు పడక గదుల ఇళ్లు కేటాయించాలని అరవిందనగర్‌కు చెందిన ఇద్దరు వినతిపత్రం సమర్పించారు. 2008లో ఇందిరమ్మ గృహనిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరవగా రూ.30 వేలతో బేస్‌మెంట్ వరకు నిర్మించగా ఎలాంటి సమాచారం లేకుండా కూల్చివేశారని.. రెండు పడక గదుల ఇళ్లు నిర్మించారని వాపోయారు.

నిలిచిన పనులపై విన్నపం



వెల్గటూరు మండలం శాఖాపూర్ గ్రామంలో మసీదు, కల్యాణ మండపం, ఖబ్రస్తాన్ పనులు వెంటనే పూర్తి చేయాలని గ్రామానికి చెందిన ముస్లిం మైనార్టీలు అధికారులకు విన్నవించారు. గ్రామంలో పనులు మంజూరవగా నిర్మాణాలు ప్రారంభించి మధ్యలో వదిలేశారని అధికారులు చొరవ చూపి వెంటనే పనులు పూర్తయ్యేలా చూడాలని కోరారు.

బిల్లులు రాక గొడవలు



కొడిమ్యాల మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేసిన పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించాలని పలు గ్రామాల మహిళా సంఘాల అధ్యక్షులు కోరారు. పనులు పూర్తయిన పాఠశాలలకు సంబంధించి బిల్లులను మూడురోజుల్లో చెల్లిస్తామని చెప్పి వారం దాటినా చెల్లించలేదన్నారు. అప్పులు చేశామని.. ఇళ్లల్లో గొడవలు జరుగుతున్నాయని వాపోయారు.

లడ్డూ వివాదంపై..



తిరుపతి లడ్డు వివాదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని విశ్వహిందూ పరిషత్తు నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన జరిపారు. అదనపు కలెక్టర్‌లకు వినతిపత్రం సమర్పించారు. దేవాలయాల్లో ప్రసాదాల కల్తీపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఆలయాలపై ప్రభుత్వ పెత్తనం తొలగించి హిందువులకే ధార్మిక పరిషత్తు ఏర్పాటు చేయాలని కోరారు.

హామీల అమలేదీ?



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ నాయకులు కోరారు. కలెక్టరేట్‌కు వచ్చి ధర్నా చేసి ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. మహిళలు, బీడీ కార్మికులకు పింఛన్ ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేపట్టాలని, అర్హులైన రైతులందరికి రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు.

పంచాయతీ భవనం నిర్మించాలి

జగిత్యాల మండలం పొలాస గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం నిర్మించాలని గ్రామస్థులు కోరారు. పాత భవనాన్ని ఏడాది క్రితం కూల్చివేసి 9 నెలల క్రితం కొత్త భవనాన్ని నిర్మాణం ప్రారంభించి ఆరు నెలలుగా పనులు నిలిపివేశారన్నారు. అధికారులు చొరవ చూపి వెంటనే పనులు పూర్తయ్యేలా చూడాలని కోరారు.

అధికారుల బృందం రాక

మల్యాల: తితిదేకు చెందిన అధికారుల బృందం రోజుల్లో కొండగట్టు అంజన్న క్షేత్రాన్ని సందర్శించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. గతంలో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇక్కడకు వచ్చినప్పుడు కొండపై వంద గదుల ధర్మశాలను నిర్మించాలని ఆలయ అధికారులు విన్నవించారు. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారులు కొండగట్టులో స్థల పరిశీలనకు రానున్నారు.

డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ


నారవేణి వేణు


వాసాల చంద్రశేఖర్



మాసుల రాజశేఖర్

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల పట్టణం కల్లూర్ రోడ్‌లో నివసిస్తున్న నారవేణి వేణు యువకుడు సోషల్ స్కూల్ అసిస్టెంట్‌లో జిల్లా మొదటి ర్యాంకును కైవసం చేసుకున్నాడు. 100కు 83.40 మార్కులు సాధించాడు. వేణు ఆగస్టులో విడుదలైన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఫలితాల్లో ఒకేసారి పీజీటీ, టీజీటీ ఉద్యోగాలు సాధించడం విశేషం. ప్రస్తుతం మేడిపల్లి గురుకుల పాఠశాలలో పీజీటీగా పని చేస్తున్నాడు. వేణుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

■ కోరుట్ల మండలం యూసుఫ్‌నగర్‌కు చెందిన మాసుల రాజశేఖర్ జిల్లా పరిధిలో స్కూల్ అసిస్టెంట్ గణితం విభాగంలో 10వ, ఎస్టీలో 25వ ర్యాంకు పొందారు.

■ మెట్‌పల్లి పట్టణ పరిధిలోని వెంకట్రావుపేటకు చెందిన వాసాల చంద్రశేఖర్ ఎస్జీటీ విభాగంలో జిల్లా పరిధిలో 9వ ర్యాంకు సాధించారు.

ఒకే ఊరిలో ఇద్దరు..


నాగరాజు


నరేందర్‌రాజు

డీఎస్సీ ఫలితాల్లో మల్లాపూర్ మండలం చిట్టాపూర్‌కు చెందిన ఇద్దరు యువకులు సత్తా చాటారు. గుగ్గిళ్ల నాగరాజు ఎస్జీటీలో 83.87 శాతం మార్కులతో మొదటి ర్యాంకు సాధించారు. తల్లిదండ్రులు గంగారాం, లక్ష్మిలు వ్యవసాయ కూలీలు. అదే గ్రామానికి చెందిన గణపతి నరేందర్‌రాజు స్కూల్ అసిస్టెంట్ సాంఘికశాస్త్రంలో 81.33 శాతంతో రెండో స్థానం సాధించారు. తండ్రి హనుమంతరాజు గతంలోనే మరణించగా, అమ్మ భూలక్ష్మి బీడీ కార్మికురాలు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరూ యువకులు ప్రభుత్వ కొలువు సాధించడంపట్ల పలువురు అభినందించారు. - మల్లాపూర్

మెట్‌పల్లి: మెట్‌పల్లి పట్టణానికి చెందిన దువ్వ దశారం స్కూల్ అసిస్టెంట్ గణిత విభాగంలో 3వ ర్యాంకు పొందారు.

చిన్ననాడే తల్లి మృతిచెందినా..


జ్యోత్స్న

జగిత్యాల మండలం గోపాలరావుపేటకు చెందిన కొత్తపల్లి జ్యోత్స్న ఎస్జీటీలో 17వ ర్యాంకు సాధించింది. ఆమె భర్త రవి జగిత్యాల డీఎస్పీ గన్‌మెన్‌గా పనిచేస్తున్నారు. ఆమె సోదరి స్వర్ణ ఇప్పటికే మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తుండటం విశేషం. జ్యోత్స్న, స్వర్ణల తల్లి చిన్ననాడే మృతి చెందగా.. ఇద్దరూ సొంతమేదారా గురుకుల పాఠశాలలో చదివారు. ఉన్నత చదువులు చదివిన వారిద్దరు ప్రభుత్వ ఉద్యోగులుగా ఎంపిక కావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. - జగిత్యాల

నేడు స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

జగిత్యాల: జిల్లాలో డీఎస్సీ ప్రకటిత నియామక పరీక్షలో స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో 1:3 ప్రాతిపదికన ఎంపికైన అన్ని సబ్జెక్టుల అభ్యర్థులు మంగళవారం ఉదయం 10 గంటలకు జగిత్యాలలోని టీటీడీ భవన్ (డీఈఓ)లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని జిల్లా విద్యాధికారి డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని, పూరించి, తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించబడిన రెండు జతల జిరాక్స్ ప్రతులతో రావాలన్నారు.

కొండగట్టు.. అభివృద్ధి వైపు

న్యూస్‌టుడే, మల్యాల


అంజన్న క్షేత్రం

మల్యాల మండలం ముత్యంపేట పరిధిలోని అంజన్న ఆలయ అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. క్షేత్రాన్ని అన్నివిధాలా అభివృద్ధిపర్చడానికి స్వామివారిపేర దాదాపు 650 ఎకరాల భూములున్నాయి. ఇటీవలే దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనరు కొండగట్టులో బృహత్ ప్రణాళిక అమలు చేయడానికి ఏడుగురు అధికారులు, ఓ అర్చకుడితో కమిటీని నియమించగా సెప్టెంబరు 13న సమావేశమై చర్చించారు. బృహత్ ప్రణాళిక అమలు చేయడానికి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కూడా ప్రత్యేక చొరవ చూపుతున్నారు.

‘రామాయణ్ సర్క్యూట్’ పథకం..

■ కొండపై ప్రధానంగా నీటి వసతి, డార్మిటరీ షెడ్లు, దాదాపు 200 వరకు ధర్మసత్రం గదులు, ఆలయ ప్రహరీ విస్తరణతోపాటు మాడవీధి ఏర్పాటు, వాహనాల పార్కింగుకు అవసరమైన స్థలం కేటాయింపు, పలు చోట్ల శౌచాలయాలు, మెట్లదారి, మాలవిమరణ మండపం నిర్మాణాలను చేపట్టాలని నిర్ణయించారు.

■ జూన్ 29న పవన్‌కల్యాణ్ అంజన్న దర్శనానికి వచ్చిన సందర్భంగా కొండగట్టులో ధర్మసత్రం గదుల నిర్మాణం చేపట్టాలని ఆలయ ఈవో విన్నవించడంతో ఆయన అందుకు అంగీకరించారు.

■ ఆలయ పరిధిలో మాస్టర్‌ప్లాన్ అమలు చేయడానికి ఈ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా ప్రత్యేక ఏజెన్సీని ఏర్పాటు చేసి పనులు అప్పగించాలని ఇప్పటికే కమిటీ తీర్మానించారు.

■ కేంద్ర ప్రభుత్వం నిధులతో ‘ప్రసాద్’ పథకం ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ యోచించినప్పటికీ ఆ పథకాన్ని వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి మంజూరు చేసే అవకాశం ఉండటంతో ఒకే పార్లమెంటు పరిధిలో రెండు ఆలయాలను ఆ పథకం కింద తీసుకునే అవకాశం లేకపోవడంతో కొండగట్టుకు ‘రామాయణ్ సర్క్యూట్’ పథకాన్ని మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం సర్వే పనులు ప్రగతిలో ఉన్నట్లు ‘న్యూస్‌టుడే’కు వివరించారు.

■ ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్ణయాలతో మున్ముందు అంజన్న కొండకు మహర్దశ పట్టనుందని భక్తులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

తరచూ తిందాం.. ఆరోగ్యంగా ఉందాం!

- జీవనశైలికి మేలు చేసే కూరగాయలు
- నేడు ప్రపంచ శాకాహార దినోత్సవం

ఈనాడు, కరీంనగర్

మారుతున్న జీవనశైలిలో శాకాహారం ప్రాధాన్యం పెరుగుతోంది. దరిచేరుతున్న రుగ్మతల కారణంగా కొందరు.. వైద్యులు సూచిస్తున్నారని మరికొందరు.. శాకాహార ప్రియులుగా మారిపోతుండగా.. అప్పుడప్పుడు మాత్రమే మాంసాహారం తీసుకుంటూ వారంలో వీలైనన్ని ఎక్కువ రోజులు శాకాహార రుచిని మరికొందరు ఆస్వాదిస్తున్నారు. నేడు ప్రపంచ శాకాహార దినోత్సవం సందర్భంగా కథనం.

ప్రయోజనాలనేకం..

- బీన్స్, కూరగాయలు, పప్పులు, బఠాణీలు తీసుకోవడం వల్ల శరీరానికి పొటాషియం, ఐరన్, పీచు సమృద్ధిగా అందుతుంది.
- మంచి బ్యాక్టీరియాపై కూరగాయలు సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది.
- తక్కువ కొవ్వు ఉండే వాటిని తినడం వల్ల మధుమేహం తగ్గుతుంది. పీచు పదార్థాలను తీసుకుంటే ఇన్సులిన్ ఉత్పత్తి మెరుగవుతుంది.
- శాకాహారంతో మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. మాంసం వల్ల అరాకిడోనిన్ యాసిడ్ ఉత్పత్తి అయి మానసిక ప్రవర్తనపై ప్రభావం చూపుతుంది.
- ఆరోగ్యంగా ఉండటానికి అవసరమైన పీచు పదార్థాలు, పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్స్, మినరల్స్ శరీరానికి చేరుతాయి.






ఇది నిజమేనండోయ్..!

- ప్రతి రోజు భోజనంలో పండ్లు, కూరగాయలు తీసుకున్న వారి కంటే.. వీటిని తీసుకోని వారిలో 30 శాతం హృదయ సంబంధ జబ్బులుంటున్నాయట.!
- శాకాహారం సరిగ్గా తినని 26-30 ఏళ్ల మధ్య వయసున్న యువకుల్లో కొవ్వు స్థాయికి మించి ఉంటుందని.. హృద్రోగ సమస్యలు అధికమని వైద్యులు చెబుతున్నారు.
- రోజులో 8 శాతం పండ్లు, ఆకుకూరలు తీసుకోవాల్సిన చోట గరిష్ఠంగా 1.5 శాతాన్ని కూడా మించకపోవడంతో పోషకాలు సరిగ్గా అందడం లేదు.
- నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్‌ఐఎన్) సర్వే ప్రకారం ప్రతిరోజు తినే ఆహారంలో 20 శాతం పీచు పదార్థాలు తప్పకుండా ఉండాలి.
- యువతుల్లో ఐరన్ లోపాన్ని అధిగమించేందుకు రోజూ ఆకుకూరల్ని తీసుకోవడంతో మేలు జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు.
- ఎరుపు, పసుపు, ఆరెంజ్ రంగుల్లో ఉండే కాయగూరలతో యాంటీఆక్సిడెంట్‌లు ఎక్కువగా అందుతాయి. దీంతో ఆరోగ్యం మెరుగవుతుంది.







సాగు తగ్గి.. దిగుమతి భారం

ఉమ్మడి జిల్లాలో కూరగాయల సాగు గణనీయంగా తగ్గిపోతోంది. దశాబ్దం కిందటితో పోలిస్తే జిల్లాలో ఉత్పత్తి తగ్గింది. దీంతో ఇతర ప్రాంతాల నుంచి వీటిని దిగుమతి చేసుకుంటుండటంతో వీటి ధరలు నింగిని తాకుతున్నాయి. కూరగాయలకు ప్రోత్సాహకాలు తగ్గడం, రాయితీ విత్తనాల సరఫరా, సరైన మార్కెటింగ్ లేక రైతులు సాగుకు విముఖత చూపిస్తున్నారు. 2016లో 6300 హెక్టార్లలో సాగైన సాగు.. ఇప్పుడు 1600కుపైగా హెక్టార్లకు పడిపోయింది. అన్నిరకాల కూరగాయలు కలిపి ప్రతి వ్యక్తి రోజులో 300 గ్రాములను ఆహారంగా తీసుకోవాలి. ఇలా ఏడాదికి 109.5 కిలోలవసరం. 38 లక్షల జనాభా ఉన్న జిల్లాలో 4.14 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయలవసరం. ప్రస్తుత ఉత్పత్తి ఏడాదిలో సగం కూడా ఉండటం లేదు. ఈ లోటునంతా పూరించేందుకు ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితిలో మార్పు వచ్చే విధంగా కూరగాయలు ప్రజలకు జిల్లాలోనే అందేవిధంగా చొరవ చూపాలి.

పోషకాల లోపం ఉండదు..



నేడు ఫాస్ట్ ఫుడ్, మాంసాహార వినియోగం పెరగడంతో చాలామందిలో పోషకాల లోపం కనిపిస్తోంది. ముఖ్యంగా చిన్నారుల్లో అధికంగా ఈ సమస్య ఉంది. ఆకు కూరలు, కూరగాయల ద్వారా చాలా పోషకాలు అందుతాయి. అన్ని వయసుల వారు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. తాజా ఆకుకూరలు, కాయగూరలతో జీర్ణక్రియ మెరుగవుతుంది. తృణధాన్యాలు, మొలకెత్తిన విత్తనాల వల్ల కూడా పోషకాలు దండిగా అందుతాయి. **- డాక్టర్ ఎం.సాయిప్రియ, న్యూట్రిషియన్, కరీంనగర్**

వంతెన కల.. సాకారమవుతున్న వేళ


పూర్తయిన వంతెన స్లాబు

రాయికల్ మండలంలోని రామారావుపల్లె - ఇటిక్యాల పెద్దవాగుపై వంతెన పనులు తుదిదశకు చేరాయి. రామారావుపల్లె గ్రామంలో సుమారు 120 కుటుంబాలు 530 జనాభా ఉంది. గ్రామస్థులు తమ అవసరాలకు నిత్యం రాయికల్ మండలానికి లేదా పక్కనున్న ఇటిక్యాల గ్రామానికి వెళ్లాలంటే మధ్యలో గోదావరి పెద్ద వాగు ఉండటంతో చుట్టూ సుమారు 10 కి.మీ.దూరం తిరిగి వెళ్తున్నారు. దశబ్దాల నాటి నుంచి ఈ వాగుపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదించినా నిధులు మంజూరు కాక ప్రజలు అవస్థలు పడ్డారు. ఎట్టకేలకు రెండేళ్ల క్రితం వంతెన, ఇరువైపులా రహదారి నిర్మాణానికి రూ.9 కోట్లు మంజూరు కాగా పనులు ప్రారంభమయ్యాయి. బిల్లులు రాక పనులు మధ్యలో ఆగిపోగా.. జనవరిలో మళ్లీ ప్రారంభించారు. పెద్దవాగుపై 280 మీటర్ల మేర 16 పిల్లర్లపై స్లాబులు పూర్తయ్యాయి. మరో మూడుమాసాల్లో వంతెన అందుబాటులోకి రానుండటంపై ఇరు గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, రాయికల్

పెండింగ్ కేసులపై ప్రత్యేక చొరవ


సమీక్షిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల, న్యూస్‌టుడే: పెండింగ్ కేసులపై ప్రత్యేక చొరవ చూపాలని ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్ష నిర్వహించారు. కేసుల సంఖ్య తగ్గించేందుకు ప్రత్యేక ప్రణాళిక చేపట్టాలని, అవసరమైతే న్యాయమూర్తులను కలిసి పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసుల్లో విచారణ వేగవంతం చేయాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మరింత మెరుగైన సేవలందించాలన్నారు. దొంగతనాల నివారణకు నిరంతరం నిఘా ఉంచాలని, ప్రతి సర్కిల్‌లో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రాసిక్యూషన్‌లో భాగంగా న్యాయస్థానాలు జారీ చేసిన నాన్‌బెయిలబుల్ వారెంట్లను అమలు పర్చాలని తప్పించుకు తిరుగుతున్న నేరస్థులను పట్టుకోవాలన్నారు. రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులతో కలిసి ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి, గుట్కా, ఇసుక, జూదం, గుడుంబా, బియ్యం తదితరాల అక్రమ దందాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దేవీనవరాత్రోత్సవాలకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గణేశ్ నవరాత్రులు, లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం తదితర సందర్భాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ భీంరావు, డీఎస్పీలు రవీంద్రకుమార్, రఘుచందర్, రంగారెడ్డి, ఉమామహేశ్వర్‌రావు, డీసీఆర్బీ, సీసీఎస్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రఫీక్‌ఖాన్, సీఐలు ఎస్.వేణుగోపాల్, రాంనర్సింహరెడ్డి, నీలం రవి, ఎ.నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సదరం శిబిరాలు

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల జనరల్ ఆసుపత్రిలో 3 నెలలపాటు సదరం శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములు తెలిపారు. అక్టోబరు నెలలో 9, 16, 23 తేదీల్లో దివ్యాంగులకు.. 22న వినికిడి.. 25న మానసిక దివ్యాంగులకు పాతబస్టాండ్ జనరల్ ఆసుపత్రిలో.. కంటి చూపునకు సంబంధించి 29న ధరూర్‌క్యాంపు మాతా శిశు కేంద్రంలో శిబిరాలు ఉంటాయని పేర్కొన్నారు.

■ నవంబరు నెలలో 6, 13, 20 తేదీల్లో దివ్యాంగులకు.. 22న వినికిడి.. 27న మానసిక దివ్యాంగులకు పాతబస్టాండ్ జనరల్ ఆసుపత్రిలో 29న కంటి చూపుకు సంబంధించిన మాతా శిశు కేంద్రంలో శిబిరాలు ఉంటాయి.

■ డిసెంబరులో 4, 11, 18 తేదీల్లో దివ్యాంగులకు.. 13న వినికిడి.. 20న మానసిక దివ్యాంగులకు జనరల్ ఆసుపత్రిలో.. 27న కంటి చూపునకు సంబంధించి మాతా శిశు కేంద్రంలో శిబిరాలు ఉంటాయని.. మీసేవలో సదరం స్లాట్ బుక్ చేసుకొని ఆధార్‌కార్డు, పాత ధ్రువపత్రాలతో ఆయా తేదీల్లో హాజరు కావాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ సూచించారు.

రైతేరాజు 8లో

నిర్వహణ భారంగా రైతు వేదికలు

సౌకర్యాలు లేక తప్పని ఇక్కట్లు

న్యూస్‌టుడే, కోరుట్ల


కోరుట్ల మండలం అయిలాపూర్ రైతు వేదిక

వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో భాగంగా వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించేందుకు గత ప్రభుత్వం ‘రైతు వేదిక’లను అందుబాటులోకి తీసుకురావాలని యోచించింది. వ్యవసాయ, పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో క్లస్టర్‌కు ఒక రైతు వేదికను నిర్మించాలని నిర్ణయించింది. జిల్లాలో మొత్తం 18 మండలాల్లో 71 క్లస్టర్‌లున్నాయి. క్లస్టర్‌కు ఒక రైతు వేదిక నిర్మాణానికి రూ.22 లక్షల నిధులను కేటాయించింది. కొన్నిచోట్ల ఈ నిధులతోనే రైతు వేదికలను నిర్మించగా, మరికొన్నిచోట్ల గ్రామ పంచాయతీ, ఇతర నిధులను కలిపి నిర్మించారు. 2020 చివర్లో రైతు వేదికల నిర్మాణం పూర్తికావడంతో వాటిని ప్రారంభించి అందుబాటులోకి తెచ్చి అన్నదాతలకు సేవలను చేరువ చేశారు.


దెబ్బతిన్న తలుపులు

మూడేళ్లకే దెబ్బతింటున్నాయి..

రైతు వేదికలు గ్రామాలకు దూరంగా నిర్మించారు. వాటి నిర్మాణంలో పూర్తిస్థాయి నాణ్యత ప్రమాణాల పాటించకపోవడంతో కొన్నిచోట్ల నిర్మించిన మూడేళ్లకే దెబ్బతింటున్నాయి. తలుపులకు పురుగు పడుతుండగా.. గోడల రంగులు వెలిసిపోయాయి. వేదికల్లోని సౌండ్ బాక్స్‌లు, కుర్చీలు, ఇతర పరికరాలు చోరీకి గురవుతున్నాయి. పలుచోట్ల కిటికీలు, టైల్స్ ధ్వంసమయ్యాయి. రాత్రిపూట మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయని అన్నదాతలు వాపోతున్నారు. సమస్యలపై జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి వాణీని ‘న్యూస్‌టుడే’ సంప్రదించగా రైతు వేదికల నిర్వహణ బిల్లులు చాలాకాలంగా రావడం లేదని.. వాటి నిర్వహణ ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు.

అయిదు నెలలే నిధులు..

■ జిల్లాలో రైతు వేదికలు రైతులకు అందుబాటులోకి వచ్చి సుమారు 3 ఏళ్లు అవుతుంది.

■ ప్రారంభంలో రైతు వేదికల నిర్వహణ కోసం నెలకు రూ.9 వేల చొప్పున నిధులు అందిస్తుండేవారు. ఇప్పటివరకు కేవలం 5 నెలలు మాత్రమే అందించారు.

■ రైతు వేదికల నిర్వహణ బిల్లులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ఏఈవోలకు భారంగా మారింది.

■ కనీస నీటి వసతి అందుబాటులో లేకపోవడంతో రైతులు, వ్యవసాయశాఖ అధికారులు అవస్థలు పడుతున్నారు.

■ రైతు వేదికలను శుభ్రం చేసేందుకు, సమావేశానికి హాజరయ్యే వారికి కుర్చీలు వేసేందుకు సిబ్బంది లేరు.

■ ఎలక్ట్రికల్ పరికరాల మరమ్మతులు, పరిసరాల శుభ్రత, పిచ్చిమొక్కల తొలగింపు, మూత్రశాలలు మరుగుదొడ్ల శుభ్రత, ఇతర ఖర్చులను ఏఈవోలు భరిస్తున్నారు.

■ చాలాచోట్ల రెండున్నరేళ్లుగా బిల్లులు చెల్లించకుండా వదిలేయడంతో భారీగా విద్యుత్తు బకాయిలు పేరుకుపోయాయి.

రైసు మిల్లర్ల సమస్యలు పరిష్కరిస్తాం

ధర్మపురి, న్యూస్‌టుడే: రైసు మిల్లర్ల సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ అన్నారు. సోమవారం ధర్మపురి పట్టణంలోని జిల్లా రైసు మిల్లర్ల సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2018 నుంచి పెండింగులో ఉన్న బిల్లులు చెల్లించాలని నాయకులు విప్‌ను కోరారు. సంఘం అధ్యక్షుడు నవీన్‌రావు, వినోద్‌రావు, శ్రీనివాస్, శంకరయ్య, వెంకటేశ్వరరావు, కోటయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల తరుణం.. యాజమాన్యం కీలకం

పైర్లలో సమస్యలు, నివారణపై జగిత్యాల పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ వివరించారు. – న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం


వరి: ముల్లుపోసే దశలోని వరిపై రుపై చాలాప్రాంతాల్లో బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆశించింది. ఆకులపై పసుపురంగు మచ్చలేర్పడి అంచుల నుంచి కిందకు వ్యాపిస్తాయి. తెగులు 5 శాతం కన్నా ఎక్కువైతే నత్రజని వేయడాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలి. తెగులుసోకిన పొలం నుంచి నీటిని రెండుసార్లు పూర్తిగా బయటకు పంపాలి. లీటరు నీటికి అగ్రిమైసిన్ 0.4 గ్రాములు లేదా ప్లాంటమైసిన్ లేదా పోషామైసిన్ మందు ద్రావణాన్ని 5-7 రోజుల వ్యవధిలో రెండుసార్లు పైరుపై పిచికారీ చేయాలి. ఈనిక దశలోని పైరుపై మొగిపురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పీ మందు 2 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పలుచోట్ల కనిపిస్తున్న జింకు ధాతువు లోప నివారణకు 2 గ్రాముల జింకుసల్ఫేట్‌ను లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు, మూడుసార్లు పిచికారీ చేయాలి. జింకు సల్ఫేట్‌తో పురుగు, తెగుళ్లమందును కలపకూడదు. అగ్గితెగులు వ్యాపిస్తున్నందున 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ లేదా 1.5 మి.లీ ఐసోప్రోథయోలిన్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

రైతేరాజు





మొక్కజొన్న: ఆలస్యంగా విత్తిన మక్కల్లో కత్తెర పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు మందును లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 0.4 మి.లీ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. [illegible] ఒక కిలో సున్నాన్ని కలిపిన మిశ్రమాన్ని మొక్కజొన్న సుడుల్లో వేసుకోవాలి. [illegible] 4 కిలోల వేపపిండికి 4 కిలోల బ్లీచింగ్ పౌడరు కలిపి పొలమంతా చల్లాలి. మక్కల్లో తేమ ఎక్కువ ఉన్నా పోషకాలను గ్రహించలేవు. ఈ సమయంలో యూరియా 20 గ్రాములు లీటరు నీటికి కలిపిగాని డీఏపీ 1-2 గ్రాములు లేదా 19-19-19 మందు 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పూతదశలో ఎకరాకు 50 కిలోల యూరియా చొప్పున వేసుకోవాలి.



పత్తి: రసంపీల్చు పురుగు తీవ్రత ఎక్కువగా ఉన్నందున మోనోక్రోటోఫాస్, నీటిని 1:4 నిష్పత్తిలో లేదా ఇమిడాక్లోప్రిడ్, నీటిని 1:20 నిష్పత్తిలో కలుపుకొని కాండానికి పూత పద్ధతిని ఆచరించాలి. పత్తి పూత దశలో 2 శాతం యూరియాను మొక్కలపై పిచికారీ చేయాలి. పత్తి మొక్కలు ఎండిపోవటం గమనించిన చోట 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2 గ్రాముల కార్బెండజిమ్, మాంకోజెబ్‌ను లీటరు నీటికి వంతున కలిపి 5-7 రోజుల వ్యవధిలో రెండు సార్లు మొక్కల అడుగు భాగం తడిచేలా పిచికారీ చేయాలి.

సాగులో రైతుల సందేహాలను జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్ర ఉద్యాన శాస్త్రవేత్త జి.వేణుగోపాల్ నివృత్తి చేశారు.

రైతు ప్రశ్న – శాస్త్రవేత్త సమాధానం

? **టమాట సాగులో ఆకు మాడు తెగులు వస్తుంది. - రాజమల్లు, రామన్నపల్లి**

✓ టమాట నారు నాటిన పది రోజుల నుంచి ఆకులపై మచ్చలు మొదలై 30 రోజులకు ఎండే స్థాయికి వస్తుంది. నివారణకు మెటీరాం, పైరాక్లోస్ట్రోబిన్ కలగలిసిన మందును లీటరు నీటికి 3 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

? **బీరతోటలో ఆకులపై తెల్లని బూజుమచ్చలు కన్పిస్తున్నాయి. - మహేందర్, మోత్కులగూడెం**

✓ మైక్లోబ్యూటానిక్ మందును లీటరు నీటికి 1 గ్రాము కలిపి పిచికారీ చేయాలి. **- న్యూస్‌టుడే, జమ్మికుంట**

సేంద్రియ విధానంలో సాగా?

మీకు తెలుసా?

సేంద్రియ విధానంలో కూరగాయల సాగు చేపట్టే వారు నేలలో పశువుల, కోళ్ల, జీవాల ఎరువు, లేదా వర్మికంపోస్టును వేసి కలియదున్నాలి. వేపపిండి, వేరుసెనగపిండి, ఆముదపు పిండి తదితరాలు వాడవచ్చు. పంటమార్పిడి పాటించాలి. జీవన ఎరువులైన అజటోబాక్టర్, అజోస్పైరిల్లం, ఫాస్ఫోబాక్టీరియాను వినియోగించవచ్చు. రసాయనాలను వాడకుండా సహజ సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు పాటించాలి.

- న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

నాటుకోళ్ల ఫారం.. యువరైతు ఆదర్శం

న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం

అందరిలా మూసధోరణిలో పంటల సాగు చేపట్టకుండా వినూత్న ఆలోచనతో యువరైతు ముందుకెళ్తున్నాడు. కోళ్ల ఫారం నిర్వహించడానికి శ్రీకారం చుట్టి లాభాలు పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

30 గుంటల్లో ఫారం : మెట్‌పల్లి మండలం మెట్లాచిట్టాపూర్‌కు చెందిన ఉత్తమ ఆదర్శ రైతు రాజారపు భూమేశ్వర్ తనయుడు రాజారపు ప్రతీశ్.. డిగ్రీ వరకు చదువుకున్నాడు. నాటుకోళ్ల పరిశ్రమ నిర్వహించాలని నిర్ణయించుకున్నాడు. గ్రామ శివారులోని వారికి ఉన్న 7 ఎకరాల్లో సుమారు 30 గుంటల భూమిని ఎంపిక చేసుకొని 2021లో నాటుకోళ్ల ఫారాన్ని ఏర్పాటు చేశాడు. వరంగల్ నుంచి ఒక్కో కోడి పిల్లకు రూ.35ల చొప్పున చెల్లిస్తూ నాలుగు నెలలకోసారి 500 వరకు తీసుకొస్తున్నాడు. రెండు నెలల వరకు వాటికి కావాల్సిన దాణాను అందిస్తూ నాటుకోళ్లను విక్రయిస్తున్నాడు.



భలే డిమాండ్ : హోటళ్లతోపాటు చికెన్ సెంటర్ల యజమానులు నేరుగా ఫారం వద్దకే చేరుకుని నాటుకోళ్లను కొనుగోలు చేస్తున్నారు. బయట కిలోకు రూ.550 నుంచి రూ.600ల వరకు ధర ఉంటోంది కానీ.. ఫారం వద్ద రూ.400లోపే ఇస్తుండటంతో చాలా ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు వస్తున్నారు. 4 నుంచి 5 నెలలకోసారి సుమారుగా రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తుండగా.. పెట్టుబడి రూ.80 వేలుపోను రూ.1.20 లక్షల లాభం మిగులుతోంది. నిత్యం ఉదయం, సాయంత్రం రెండు గంటల చొప్పున నాటుకోళ్లను చూసుకుంటూ మిగతా సమయంలో తండ్రితో కలిసి వ్యవసాయం చేస్తుంటానని.. ప్రస్తుతం కోళ్లఫారంపై లాభాలు వస్తున్నందున సంతోషంగా ఉందని తెలిపాడు ప్రతీశ్.

బాధ్యత గుర్తిద్దాం.. భరోసానిద్దాం!

నేడు ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం



న్యూస్‌టుడే, కరీంనగర్ మంకమ్మతోట

ఒకప్పుడు ఇంట్లో పెద్ద మనిషి ఉండేలానుకునే వారు. జీవితంలో వారి అనుభవానికి ప్రాధాన్యమిచ్చే వారు. ఏదైన సలహా అవసరమైతే వారినే సంప్రదించేవారు. కానీ నేడు ఆ పరిస్థితి మారింది. వారిని భారంగా భావిస్తున్నారు. వయసు మీద పడిన తల్లి దండ్రులను వేరుగా ఉంచుతున్నారు. లేదా ఆశ్రమంలో చేర్పిస్తున్నారు. దిక్కూమొక్కులేని వారిని ప్రభుత్వ ఆశ్రమాలు చేర్చుకుంటున్నాయి. వృద్ధాప్యం అనేది సామాజిక సమస్యగా మారడంతో భారత ప్రభుత్వం వృద్ధుల సంరక్షణ చట్టాన్ని తీసుకొచ్చింది. కానీ దానిని అమలు చేయాల్సిన అధికారుల ఉదాసీన వైఖరితో వారికి భరోసా కరవైంది. మంగళవారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బాధ్యతను గుర్తించి.. వారికి భరోసా ఇవ్వాలని సూచిస్తూ ప్రత్యేక కథనం.



కరీంనగర్ ప్రభుత్వ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు

చట్టం ఏం చెబుతుందంటే...

భారత ప్రభుత్వం 2007లో తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం రెవెన్యూ డివిజన్ స్థాయిలో అప్పిలేట్ ట్రైబ్యునల్ ఏర్పాటు చేశారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసిన వారిని ట్రైబ్యునల్‌లో విచారించి, న్యాయం చేయాలి. వారు జీవించడానికి భృతి ఇప్పించాలి. ట్రైబ్యునల్ ఆదేశాలను బేఖాతర్ చేస్తే కలెక్టర్ జోక్యం చేసుకొని న్యాయం చేయాలి. అనాథలు, ఆదరణకు నోచుకొని వృద్ధులు జీవించడానికి వారిని అనాథాశ్రమాల్లో చేర్పించాలి. వారు ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. పోలీసులను ఆశ్రయించిన వారికి సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి. కానీ క్షేత్ర స్థాయిలో సరిగా అమలు కావడంలేదు.

టోల్‌ఫ్రీ నంబర్.. 14567

వృద్ధులు ఎలాంటి ఆపదలో ఉన్నా.. 14567 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించవచ్చు. వారు ఆపదలో ఉన్నట్లైతే సురక్షిత ప్రాంతానికి తరలించడానికి వాహన సౌకర్యం సైతం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సేవలందించేందుకు ఒక వాహనం కరీంనగర్ జిల్లాలో అందుబాటులో ఉంది.

ఒకే వేదికపై కలుసుకునేలా..

జిల్లా కేంద్రంలో రెండేళ్ల కిందట డేకేర్ సెంటర్ ఏర్పాటు చేశారు. వారందరు కలిసి మాట్లాడుకోవడానికి సమావేశ గది, దినపత్రికలు, ఫిజియోథెరపీ లాంటి సౌకర్యం కల్పించారు. పలువురు వృద్ధులు ప్రతి రోజు సమూహంగా కలిసి ఒంటరితనం లేకుండా ఆహ్లాద వాతావరణంలో ఉండే అవకాశం దక్కింది.


పెరుగుతున్న ఆశ్రమాలు..

గతంలో వృద్ధాశ్రమాల్లో అనాథలు మాత్రమే కనిపించేవారు. వివిధ కారణాలతో కొందరు ఆశ్రమాలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేసి, పదవీ విరమణ పొంది పింఛన్ పొందుతున్న వారికి మాత్రం చాలా చోట్ల కుటుంబాల్లో ఆదరణ లభిస్తుంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆశ్రమంతోపాటు మరో 13 వృద్ధాశ్రమాలు ఉన్నాయి. ఇప్పుడు తమ తల్లిదండ్రులను చూడకుంటే.. భవిష్యత్తులో తమకూ అదే పరిస్థితి వస్తుందని భావించి బాధ్యతగా మెలగాలి.

సమస్యలతో సహవాసం..

రాష్ట్రంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల తర్వాత ప్రభుత్వ వృద్ధుల ఆశ్రమం కరీంనగర్‌లోనే ఉంది. ఇక్కడ 30 మంది వృద్ధులు, మరో 30 మంది దివ్యాంగులకు చోటు కల్పిస్తున్నారు. యాభై ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన ఆశ్రమం కావడంతో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. సౌకర్యాలూ అంతంత మాత్రమే. పలుమార్లు పర్యటించిన రాష్ట్ర దివ్యాంగుల శాఖ డైరెక్టర్ సైతం నూతన భవనం నిర్మించాలని సూచించినా అడుగు ముందుకు పడట్లేదు. వీరబ్రహ్మేంద్ర అనాథాశ్రమాన్ని 20 ఏళ్లుగా వీరమాధవ్ స్వచ్ఛందంగా నిర్వహిస్తున్నారు. మిగిలిన ఆశ్రమాలు సౌకర్యాల కల్పనను బట్టి రుసుములు తీసుకుంటున్నాయి.

ఇరవై ఏళ్లుగా ఉంటున్నా..



నా పేరు కొండయ్య. వయసు 80 ఏళ్లు. కరీంనగర్ మండలం ఖాజీపురం మా ఊరు. సంతానం లేక, బంధువులు దరికి రానివ్వకపోవడంతో ఇరవై ఏళ్ల కిందట ప్రభుత్వ ఆశ్రమంలో చేరాను. అప్పటి నుంచి ఇక్కడే నా జీవితం, ఆశ్రమంలో మరిన్ని వసతులు కల్పించాలి.

చట్టం పకడ్బందీగా అమలు చేయాలి

రక్షణకు చట్టాలు అమలులో తాత్సారం జరుగుతుంది. చట్ట ప్రకారం న్యాయం జరగట్లేదు. ఈ విషయంపై ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వ ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశాం. చట్టం అమలుకు సంబంధిత అధికారులందరు సహకరించాలి. **- సముద్రాల జనార్దన్‌రావు, వయోవృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు**

నిరాదరణకు గురైన వారికి న్యాయం

వయోవృద్ధుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఆపదలో ఉన్న వారి సమాచారం తెలవగానే వారిని సురక్షిత స్థలానికి చేర్చి, అవసరమైన చర్యలు చేపడుతున్నాం. నిరాదరణకు గురైన వారికి న్యాయం జరిగేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.

- ఎం.సరస్వతి, జిల్లా సంక్షేమ అధికారి

బంధువులు పట్టించుకోలేదు..



మాది పెద్దపల్లి జిల్లా. నా పేరు నర్సమ్మ. కొన్నేళ్ల కిందటనే భర్త మరణించాడు. పిల్లలు లేరు. బంధువులు పట్టించుకోలేదు. తప్పని పరిస్థితుల్లో మూడేళ్ల కిందట కరీంనగర్ ప్రభుత్వ ఆశ్రమంలో చేరాను. నాలాంటి దిక్కులేని వారికి ఆసరా నిలవడానికి మరిన్ని ఆశ్రమాలు అవసరం.

హ్యాండ్‌బాల్ జట్టు క్రీడాకారుల ఎంపిక పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్

కరీంనగర్ కొత్తపల్లి, న్యూస్‌టుడే: ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ స్టేడియంలో సోమవారం ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ మహిళలు, పురుషుల ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీల్లో 250 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటారు. పోటీలను జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, ఆర్‌ఐ మోడెం సురేష్‌లు ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు 9 నుంచి 11 వరకు రంగారెడ్డిలో జరిగే 53వ రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతారని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బి.లక్ష్మణ్ తెలిపారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి ప్రభాకర్, కోచ్ వెంకటేష్, మల్లేశ్, సురేందర్, కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.

భారాస నేతల మొసలి కన్నీరు

మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



కరీంనగర్‌లో అంగన్‌వాడీ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే సత్యనారాయణ, అధికారులు

కరీంనగర్ పట్టణం, మానకొండూర్, న్యూస్‌టుడే : పదేళ్లపాటు పాలన చేసి తెలంగాణను విధ్వంసం చేసిన భారాస నేతలు ప్రస్తుతం అక్రమ కట్టడాలు కూల్చివేస్తుంటే మొసలి కన్నీరు కారుస్తున్నారని పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం పోషణ ఆరోగ్య జాతర కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి ఆమె హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. పలు ప్రాంతాల్లో చెరువు మధ్యలో కొందరు అక్రమంగా భవనాలు నిర్మించారని, వీటితో పట్టణాలు నీటిలో మునిగాయని.. ఖమ్మం, మహబూబాబాద్‌లలో ఇటీవల వచ్చిన వరదలకు ఇలాంటి నిర్మాణాలే కారణమని అన్నారు. గత భారాస ప్రభుత్వం కామారెడ్డి వెళ్లే దారిలో చెరువులోనే రెండు పడక గదుల ఇళ్లను కట్టిందని ఆరోపించారు. మధ్య మానేరు, మల్లన్నసాగర్ జలాశయాల నిర్మాణ సమయంలో గత ప్రభుత్వం స్థానికులను ఎంత బలవంతంగా ఖాళీ చేయించిందో అందరికి తెలుసని అన్నారు. ప్రస్తుతం హరీశ్‌రావు, కేటీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. మూసీ పరీవాహక ప్రాంతంలో ఇళ్లు కోల్పోతున్న పేదలకు మాత్రం స్థిర నివాసం కల్పిస్తామని, పేదల డిమాండ్లను సీఎం వింటారని తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క కరీంనగర్ అతిథిగృహంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. కలెక్టర్లు, అధికారులు వారంలో 2, 3 రోజులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలన్నారు. అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. విధులపై అలసత్వం వహిస్తే ఉపక్షేంచేదీ లేదని తెలిపారు. 2 నుంచి బతుకమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ పుస్తకాలను ఆవిష్కరించారు. సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ, డైరెక్టర్ కాంతి వెస్లీ, గ్రామీణాభివృద్ధి కమిషనర్ అనితా రామచంద్రన్, కలెక్టర్లు పమేలా సత్పతి, సత్యప్రసాద్, కోయ హర్ష, సందీప్ కుమార్‌ఝా, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్సీ కోదండరాం



ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానిస్తున్న పార్టీ నాయకులు, సంఘాల ప్రతినిధులు

తెలంగాణచౌక్(కరీంనగర్), న్యూస్‌టుడే: ఎక్కడికి వెళ్లినా సమస్యలపై విజ్ఞాపనలు అందుతున్నాయని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడంతోపాటు ప్రజా గొంతుకగా మారుతానని ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం అన్నారు. సోమవారం కరీంనగర్‌లో జనసమితి ఆధ్వర్యంలో ప్రెస్‌భవన్‌లో కోదండరాం పౌర సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలో ఇప్పుడిప్పుడే ప్రజాస్వామ్య వాతావరణం నెలకొంటుందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. గత ప్రభుత్వ తప్పిదాలతో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైందని ఆరోపించారు. కరీంనగర్‌లో పాత్రికేయులకు ఇచ్చిన నివేశన స్థలాలకు సంబంధించి ఎన్‌వోసీ విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం పలు సంఘాల నేతలు ఎమ్మెల్సీని సత్కరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, జనసమితి రాష్ట్ర కార్యదర్శి ముక్కెర రాజు, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, వివిధ సంఘాల నాయకులు నరహరి జగ్గారెడ్డి, మాసం రత్నాకర్, గోపాల్‌రెడ్డి, జక్కోజు వెంకటేశ్వర్లు, బి.వెంకటమల్లయ్య, మార్వాడి సుదర్శన్, రమణారెడ్డి, ఫయాజ్, జునేద్, తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితులు.. ప్రాణదాతలు

న్యూస్‌టుడే, కరీంనగర్ సాంస్కృతికం

కృత్రిమంగా సృష్టించలేనిది రక్తం. అందుకే అవసరార్థులకు దానం చేయడం మినహా మరో దారి లేదు. కొందరు కుటుంబ, బంధువర్గాలకు ఇచ్చేందుకు ముందుకొస్తారు. మరికొందరు సామాజిక బాధ్యతతో అవసరమున్న వారికి ఇస్తారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా సమాజంలో ఆపద సమయంలో ముందుకొచ్చి మానవత్వాన్ని చాటుకుంటున్నారు కొందరు. మంగళవారం 'జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం' సందర్భంగా కథనం.

నేడు స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం



రక్తదానం చేస్తున్న వాలంటీర్లు

వాలంటీర్లు..

రక్తం ఇచ్చే క్రమంలో సూదులకు, నొప్పులకు భయపడటంతోపాటు బలహీనమవుతామని కొందరు భావిస్తారు. ఈ అపోహలు తొలగించేందుకు వాలంటీర్లు కృషి చేస్తున్నారు. ప్రత్యేక శిబిరాలూ నిర్వహిస్తుంటారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ప్రత్యక్షంగా దానం చేస్తారు. రోడ్డు ప్రమాదాలు, శస్త్రచికిత్స, హింసాత్మక ఘటనల సమయంలో రక్తం అవసరమవుతుంది. ముఖ్యంగా ఆరోగ్యంగా ఉన్న యువత ఏడాదిలో ఒకటి రెండు సార్లు దానం చేయడం మంచిదని వైద్యులు పేర్కొంటున్నారు. రెడ్‌క్రాస్, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ వాలంటీర్లు, యువజన సంఘాలు, సినీ హీరో అభిమాన సంఘాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించి అవసరార్థులకు హితోధికంగా సహాయపడుతున్నారు.

ఈ రోజే ఎందుకంటే..


రక్తనిధి కేంద్రం సంఘం ఏర్పాటుతోపాటు ఇండియన్ సొసైటీ ఆఫ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ అండ్ ఇమ్యునోహెమటాలజీ స్థాపించి డాక్టర్ జై గోపాల్ జోలీ విశేష సేవలందించారు. ఆయన అక్టోబరు ఒకటిన జన్మించడంతో ఏటా ఆ రోజు 'జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవంగా నిర్వహించుకుంటున్నాం. మన దేశంలో రక్తం కొరతతోపాటు సరిపోయే విధంగా నిల్వ కేంద్రాలు లేవు. ఆరోగ్యవంతుల్లో అపోహలను తొలగించి.. వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చేలా ప్రేరణ కల్గించే విధంగా అక్టోబరు ఒకటిన ఈ దినోత్సవం నిర్వహిస్తారు.

ముఖ్యాంశాలు కొన్ని...

- రక్తదానంలో విధిగా డిస్పోజబుల్ నీడిల్స్ వాడాలి.
- కరీంనగర్‌లో 8 రక్త కేంద్రాలు ఉన్నాయి. ఇందులో వెయ్యి లీటర్లు వివిధ గ్రూపు రక్తం అందుబాటులో ఉంది.
- వివిధ స్వచ్ఛంద గ్రూపులలో దాదాపు 3 వేల మంది రక్తదాన వాలంటీర్లు ఉన్నట్లు అంచనా.
- కొందరు జన్మదినాలను పురస్కరించుకొని.. నిల్వ కేంద్రాలకు స్వచ్ఛందంగా వెళ్లి రక్తదానం చేస్తుంటారు.
- దాతకు పరీక్షలు జరిపిన తర్వాతనే రక్తం సేకరిస్తారు.
- ఆరోగ్యవంతులై 18-60 ఏళ్ల వారు.. 45 కిలోలకు పైగా బరువు ఉన్నవారు మాత్రమే ఇవ్వాలి.
- ప్రతి మూడు మాసాలకు ఒక సారి 350 మిల్లీలీటర్లు ఇవ్వొచ్చు.
- స్వచ్ఛంద రక్తదాతలో ఎలాంటి వ్యాధులు, రుగ్మతలు ఉండకూడదు. (రేబిస్, క్యాన్సర్, బీపీ, మధుమేహం, క్షయ, హెచ్ఐవీ, సుఖవ్యాధులు ఉండరాదు)
- కొన్ని యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, సినీ హీరోల అభిమాన సంఘాల ప్రతినిధులు వాట్సప్ గ్రూపుల సమాచారంతో స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు.

65 సార్లు ఇచ్చా..

అవసరార్థులకు, రక్తదాన శిబిరాల్లో ఇప్పటి వరకు 65 సార్లు రక్తదానం చేశాను. నాది 'ఓ పాజిటివ్(విశ్వదాత)' గ్రూప్ కావడంతో తరచూ ఇస్తుంటాను. 1991 నుంచి ఏటా కనీసం రెండు, మూడు సార్లు ఇస్తున్నా. 1997 నుంచి రెడ్‌క్రాస్ సొసైటీ జీవిత కాల సభ్యుడిగా కొనసాగుతున్నా. మూడు సార్లు రాష్ట్ర గవర్నర్ నుంచి, 2023లో మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా అవార్డులు తీసుకున్నా.



- వుట్కూరి రాధాకృష్ణారెడ్డి, కార్యదర్శి, రెడ్‌క్రాస్ సొసైటీ

అరుదైన గ్రూప్..

నాది అరుదైన 'బి నెగటివ్' గ్రూప్. అత్యవసర పరిస్థితుల్లో చాలా సార్లు రక్తదానం చేశా. ఆ రోగి ఆరోగ్యం కుదుటపడిన తర్వాత వాళ్లు వచ్చిన కృతజ్ఞతలు చెప్పినప్పుడు ఎంతో ఆనందం కలుగుతుంది. ఒక విధమైన సంతృప్తి కల్గుతుంది.



- ముస్కు సంతోష్‌రెడ్డి, ప్రైవేటు టీచర్

పండగల నిర్వహణకు రూ.31.46 లక్షలు


బల్దియా సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో బతుకమ్మ, దసరా పండగలను ఘనంగా నిర్వహించేందుకు రూ.31.46 లక్షలు కేటాయించినట్లు పురపాలిక అధ్యక్షురాలు అడువాల జ్యోతి పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన స్థానిక బల్దియా సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడుతూ గతంలో కంటే పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు కార్యాచరణ చేపట్టామన్నారు. పట్టణంలో కుక్కల బెడద నియంత్రణకు, యాంటి రేబిస్ కార్యక్రమ నిర్వహణకు రూ.70 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఛైర్‌పర్సన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి డిమాండ్

గతంలోనే పూర్తయిన వైస్ ఛైర్మన్, ఛైర్‌పర్సన్ ఛాంబర్ల మరమ్మతు పనుల ఖర్చు రూ.1.80 లక్షలను తాజాగా ఎజెండాకు తీసుకురావడంపై సభ్యులు అధికారులను నిలదీశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాలని పలువురు సభ్యులు కోరారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని చెత్త సేకరణ చేపట్టడం లేదని సభ్యులు పేర్కొన్నారు. దోమల మందు సైతం చల్లడంలేదని.. పట్టణ ప్రజలంతా తీవ్రమైన జ్వరాలు, ఒళ్లు నొప్పుల బారిన పడి అల్లాడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. శరన్నవరాత్రోత్సవాల్లో దుర్గామాత మండపాలకు రూ.50 వేల చొప్పున కేటాయించాలని పలువురు కోరారు. రూ.9 లక్షలతో కొనుగోలు చేసిన ఆస్తిపన్ను వసూలు చేతియంత్రాల కొనుగోలుపై విచారణ చేపట్టాలన్నారు. కొంతకాలంగా పట్టణంలో అభివృద్ధి కుంటుపడిందని.. ఏ వార్డులోనూ ప్రగతి పనులు చేపట్టడంలేదని పలువురు విపక్ష సభ్యులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

మురుగుకాల్వలు నిర్మించాలి

వార్డుల్లో పలు అభివృద్ధి పనులు అపరిష్కృతంగా ఉన్నాయి. ప్రతివార్డులోనూ అభివృద్ధి పనులకు నిధులు ఎందుకు కేటాయించడంలేదు. యావర్ రోడ్డు మురుగుకాల్వ అధ్వానంగా ఉంది. కుక్కలను పట్టుకునేందుకు పాత బిల్లు తాజా ఖర్చు కలిపి రూ.70 లక్షలు ఎజెండాలో చూపడం సరికాదు. అన్ని వార్డులకు నూతన మురుగుకాల్వల నిర్మాణాలకు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

- అనుమల్ల కృష్ణహరి, భాజపా ఫ్లోర్‌లీడర్

నిధుల కేటాయింపుపై రగడ


కోరుట్ల పుర సమావేశంలో నిరసన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

కోరుట్ల, న్యూస్‌టుడే: నిధులు కేటాయింపు, బదలాయింపులపై కోరుట్ల పురపాలక సంఘ సమావేశంలో రగడ నెలకొంది. సోమవారం పుర అధ్యక్షురాలు అన్నం లావణ్య అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో 9, 10, 11 వార్డులను కలిపే సిమెంట్ రోడ్ నిర్మాణానికి రూ.35 లక్షలు కేటాయిస్తూ సభ్యులు ఆమోదం తెలిపారు. తర్వాత ఆ కేటాయింపులు తొలగించి వాటిని ఒక్కో వార్డుకు రూ.1.70 లక్షలు, 26 వార్డులకు రూ.2.70 లక్షల చొప్పున మొత్తం రూ.35 లక్షల నిధులను అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ల వార్డులకు కేటాయిస్తూ ప్రస్తుత సమావేశంలో ప్రవేశపెట్టగా మిగతా కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నిధుల తొలగింపుపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని.. ఆ సీసీరోడ్ నిర్మాణం కోసం టీయూఎఫ్ఐడీసీ నిధులను గతంలోనే కేటాయించడంతో వాటిని రద్దు చేసినట్లు కమిషనర్ తిరుపతి సమాధానమిచ్చారు. దీంతోపాటు పట్టణ శివారులోని పశువైద్య కళాశాల వద్ద మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు విగ్రహ ఏర్పాటుకు రూ.21 లక్షల నిధులు కేటాయించడంతో భారాస, భాజపా, ఎంఐఎం కౌన్సిలర్లు అభ్యంతరం తెలుపుతూ సభ వేదికపై ఆందోళనకు దిగారు. ఛైర్‌పర్సన్, కమిషనర్‌లతో వాదించడంతో సభలో గందరగోళం నెలకొంది. సభలో మొత్తం 15 అంశాలను పొందుపర్చగా 2, 14వ అంశాలపై 12 మంది వార్డు సభ్యులు అభ్యంతరం తెలిపినట్లు అధికారులు ప్రకటించారు. వైస్‌ఛైర్మన్ గడ్డమీది పవన్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కౌన్సిలర్ల వార్డులకే కేటాయింపులా?

కోరుట్ల: కోరుట్ల మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులను కేవలం కాంగ్రెస్ వార్డులకు మాత్రమే కేటాయించడాన్ని ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ తప్పుబట్టారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. భారాస, భాజపా, ఎంఐఎం కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులకు కేటాయించకుండా వివక్షత చూపడం సరికాదన్నారు. మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు విగ్రహ ఏర్పాటుకు పురపాలక సంఘం సాధారణ నిధులు రూ.21 లక్షలను ఎలా కేటాయిస్తారని, దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మున్సిపల్‌లకు ఎలాంటి నిధులు కేటాయించలేదని, వర్షాకాలంలో రోడ్లు దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నిధులు లేవంటూ పారిశుద్ధ్య కార్మికులకు సరిగా వేతనాలు చెల్లించడం లేదని, అలాంటిది నిధులు ఎలా వృథా చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీసీల హక్కులను సాధించుకోవాలి

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: బీసీలందరం ఏకమై హక్కుల కోసం పోరాడితేనే ఏదైనా సాధించగలమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజాల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని వాసవి గార్డెన్‌లో బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లా వెంకటేశ్వర్లు అధ్యక్షతన బీసీ కులగణన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు మాట్లాడుతూ 60 శాతం బీసీ జనాభా ఉన్న తెలంగాణలో 19 మంది బీసీ ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచే వరకు సంఘటితంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భైరి రవికృష్ణ, రాష్ట్ర కార్యదర్శి బొమ్మెన శంకర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లా వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు బ్రాహ్మణ భేరి నరేశ్, కరీంనగర్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, నారోజు రాకేశ్, రంగు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ధర్మపురి: వెల్గటూర్ మండలం రాజారంపల్లెకి చెందిన దర్శనాల జమున కుటుంబానికి ఎన్నారైలు రూ.1.53 లక్షల విరాళాన్ని అందించారు. కూతురు ఎంబీబీఎస్ మూడో సంవత్సరం, కుమారుడు ఎంబీఏ చివరి ఏడాది చదువుతుండగా ఫేస్‌బుక్ ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని అండగా నిలిచారు. స్థానిక సీఐ, సదరు బ్యాంకు మేనేజర్‌లు ఈ సాయాన్ని సోమవారం జమున కుటుంబానికి అందజేశారు.

యువకుడి మృతదేహం లభ్యం

ధర్మపురి: మండలంలోని రాయపట్నం గోదావరిలో నీట మునిగి గల్లంతైన యువకుడు పవన్‌కుమార్(19) మృతదేహం సోమవారం లభ్యమైంది. కరీంనగర్‌లోని శ్రీనగర్ కాలనీకి చెందిన పవన్‌కుమార్, అశ్విన్, నవిత్‌వర్మలు దేవీ నవరాత్రి ఉత్సవాల దీక్షను స్వీకరించేందుకు.. ఆదివారం రాయపట్నం గోదావరిలో స్నానం చేసేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చారు. నదిలో నదిలో స్నానాలు చేస్తుండగా ప్రమాదవశాత్తు పవన్‌కుమార్ నీట మునిగాడు. తల్లిదండ్రుల రోదన అక్కడున్నవారిని కంటతడి పెట్టించింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనం చోరీ

కోరుట్ల : కథలాపూర్ మండలం తాండ్ర్యాల గ్రామానికి చెందిన అబ్దుల్ హైమద్‌కు చెందిన ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. హైమద్ ఈనెల 29న తాండ్ర్యాల క్రాస్‌రోడ్‌లోని ఓ హోటల్ వద్ద తన వాహనం నిలిపి లోపలికి వెళ్లాడు. అనంతరం బయటకు వచ్చి చేసేసరికి వాహనం కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

కోళ్ల పందేలపై పోలీసుల దాడి

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల మండలం యూసుఫ్‌నగర్ గ్రామ శివారులో ఆదివారం రాత్రి నిర్వహించిన కోళ్ల పందేలపై పోలీసులు దాడులు చేశారు. కోళ్ల పందెం నిర్వహిస్తున్న 8 మందిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయిదు కోళ్లు, రూ.10,500లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

వాహనాలు సీజ్

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల మండలం అయిలాపూర్ మేజర్ గ్రామ శివారులోని గుట్టమట్టి అక్రమ తవ్వకాలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి ఒక జేసీబీ, రెండు ట్రాక్టర్‌లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ కిషన్ తెలిపారు. నాగులపేట గ్రామశివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

కోరుట్ల: కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామ శివారులోని వాగులోంచి ఇసుకను అక్రమంగా తవ్వి తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నట్లు ఆర్ఐ నగేశ్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌ను తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఘనంగా వీడ్కోలు


ఎం.డి.షోయబ్ ఉల్‌హక్‌ను సన్మానిస్తున్న అధికారులు

జగిత్యాల, న్యూస్‌టుడే: అధికారులు, సిబ్బందికి తమ సేవాకాలంలో చేసిన సేవలే చిరస్థాయి గుర్తింపునిస్తాయని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం ఉద్యోగ విరమణ చేసిన ఏఎస్సై వలిబేగ్, హెడ్‌కానిస్టేబుల్ రాజయ్యలను సన్మానించి జ్ఞాపిక అందించారు. ఇద్దరినీ పోలీసు వాహనం ఎక్కించి పోలీసు బ్యాండ్‌తో ఘనంగా వీడ్కోలు పలికారు. అదనపు ఎస్పీ భీంరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్, వేణు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

సేవలతోనే గుర్తింపు

జగిత్యాల : ప్రభుత్వ ఉద్యోగులకు సేవలతోనే చిరస్థాయి గుర్తింపు లభిస్తుందని జిల్లా పంచాయతీరాజ్ ఈఈ అబ్దుల్ రహమాన్ అన్నారు. జగిత్యాల ఏఆర్ సబ్ డివిజన్‌లో జూనియర్ టెక్నికల్ అధికారిగా పనిచేస్తున్న ఎం.డి.షోయబ్ ఉల్‌హక్ సోమవారం పదవీ విరమణ చెందగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలు కొనియాడారు. పంచాయతీ రాజ్ డిప్యూటీ ఇంజినీర్ అసోసియేటెడ్ అధ్యక్షుడు రాజమల్లయ్య, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, మల్యాల డిప్యూటీ ఈఈలు మిలింద్, గోపాల్, సత్యనారాయణరావు, రమణారెడ్డి, చంద్రశేఖర్, ప్రసాద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుడిగా వచ్చి స్వీపరుగా ఉద్యోగ విరమణ


నర్సయ్యను సన్మానిస్తున్న ఆలయ అధికారులు

మల్యాల, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతూ కొండగట్టు అంజన్న ఆలయానికి వచ్చి కొండపైనే ఉన్న ఓ భక్తుడు చివరికి పారిశుద్ధ్య కార్మికుడుగా కొలువులోకిచేరి సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. వివరాల్లోకి వెళితే.. తిమ్మాపూర్ మండలం వచ్చునూరుకు చెందిన ఉప్పులేటి నర్సయ్య అనారోగ్య కారణంతో దాదాపు 35 ఏళ్ల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి కొండగట్టు అంజన్న సన్నిధికి వచ్చారు. కొన్నాళ్లపాటు అంజన్న క్షేత్రంలోనే బస చేస్తే ఆరోగ్యం కుదుట పడుతుందన్న విశ్వాసంతో కొండపైనే ఉన్నారు. చివరికి అప్పటి ఆలయ అధికారుల సహకారంతో దినసరి పారిశుద్ధ్య కార్మికుడిగా పనిలో చేరారు. కొన్నేళ్ల తర్వాత నర్సయ్య ఉద్యోగం పర్మినెంటు కావడంతో ఇక్కడే జీవనం సాగించారు. సోమవారం నర్సయ్య ఉద్యోగ విరమణ పొందడంతో ఆయనను ఆలయ అధికారులు శాలువాతో సత్కరించి ప్రసాదం అందజేశారు. ప్రస్తుతం నర్సయ్యకు భార్యా పిల్లలు ఎవరూ లేకపోవడంతో ఆయన సమీప కుటుంబ సభ్యులు హాజరైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

బస్సుషెల్టర్ కోసం ఇరుపార్టీల వాగ్వాదం

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: మెట్‌పల్లి పాతబస్టాండ్ వద్ద వెల్లుల్ల రోడ్డులో బస్సు షెల్టర్ నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు సోమవారం ప్రారంభించారు. ఇది ఖాదీ స్థలమని భారాస నాయకులు అడ్డుకొని అభ్యంతరం తెలపడం ఉద్రిక్తతతకు దారి తీసింది. డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు ఇరువర్గాలను కార్యాలయానికి పిలిపించి సముదాయించారు. సాయంత్రం కాంగ్రెస్ నాయకులు షెడ్డు వేయించడం మొదలుపెట్టడంతో గొడవ మళ్లీ మొదలైంది. తహసీల్దార్ శ్రీనివాస్, పోలీసులు చేరుకున్నారు. చివరకు కలెక్టర్ ఆదేశాలతో పనులు నిలిపివేయిస్తున్నట్లు కమిషనర్ మోహన్ తెలిపారు.

షాదీముబారక్ చెక్కుల పంపిణీ

గొల్లపల్లి: ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ అన్నారు. గొల్లపల్లిలో సోమవారం లబ్ధిదారులకు రూ.3 లక్షల విలువైన షాదీముబారక్ చెక్కులు అందజేశారు. ఏఎంసీ ఛైర్మన్ సంతోష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పంట రుణాల పంపిణీ

జగిత్యాల వాణిజ్యం, న్యూస్‌టుడే: జగిత్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని సంఘం ఆవరణలో సోమవారం నిర్వహించి సంఘం ఆర్థిక లావాదేవీలపై చర్చించి తీర్మానించారు. సంఘం అధ్యక్షుడు పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతులకు పంట రుణాలను పంపిణీ చేశారు.

రాయికల్ పట్టణం: రాయికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు ఏనుగు మల్లారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంఘం కార్యనిర్వహణ అధికారి రవి, కేడీసీసీ బ్యాంకు మేనేజర్ మార్కండేయ, సంఘం వైస్ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

రాయికల్: అల్లీపూర్‌లో అల్లీపూర్ సహకార సంఘ అధ్యక్షుడు యాదవేని రాజలింగం యాదవ్ ఆధ్వర్యంలో సంఘ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధ్యక్షుడు మహదేవయ్య, పాలకవర్గ సభ్యులు రాంరెడ్డి, రాజరెడ్డి, గంగాధర్, చంద్రకళ, గంగు, బక్కయ్య, సీఈవో ఉపేందర్ తదితరులున్నారు.

నారసింహుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు

ధర్మపురి, న్యూస్‌టుడే: ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సోమవారం రవాణాశాఖ జాయింటు కమిషనర్ రమేష్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వచన మండపంలో ఆలయ సిబ్బంది, అర్చకులు ఆయనకు ఘనంగా ఆశీర్వాదం చేయగా.. దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

దుబాయిలో బతుకమ్మ వేడుకలకు ఆది శ్రీనివాస్

మేడిపల్లి, న్యూస్‌టుడే: దుబాయిలో ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ (ఈటీసీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బతుమ్మ వేడుకలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరు కానున్నారు. అక్టోబరు 6న దుబాయిలో ఈటీసీఏ ఆధ్వర్యంలో 14వ సారి వేడుకలు నిర్వహించనున్నారు.

ఆర్థికాభ్యున్నతి సాధించాలి

జగిత్యాల గ్రామీణం : మహిళలు బ్యాంకులు ఇచ్చే రుణాలతో ఆర్థికంగా ఎదగాలని ఉమ్మడి జిల్లా రిజర్వు బ్యాంకు అధికారి సాయితేజరెడ్డి అన్నారు. జగిత్యాల గ్రామీణ మండలం పొరండ్లలో మహిళా సంఘ సభ్యులతో సోమవారం ముఖాముఖిలో పాల్గొని పలు వివరాలు తెలుసుకున్నారు.

బహుమతుల ప్రదానం

జగిత్యాల పట్టణం: విద్యార్థినులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి కె.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో గెలుపొందిన విద్యార్థులు నేహ, సంస్కృతిలకు కళాశాలలో ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతితో కలిసి సోమవారం బహుమతులు అందజేసిన సందర్భంగా మాట్లాడారు. ప్రిన్సిపల్ అలియా మక్సూద్ పాల్గొన్నారు.


జగిత్యాలలోని తపోవన్ పాఠశాలలో..


రాయికల్‌లో..

ముందస్తు బతుకమ్మ సంబరాలు


కోరుట్ల డిగ్రీ కళాశాలలో..

జిల్లాలో పలుచోట్ల సోమవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయినులు, అధ్యాపకులు బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. అనంతరం దగ్గర్లోని కుంటలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు.

– న్యూస్‌టుడే యంత్రాంగం


మల్యాలలో...

సంక్షిప్తం

మంత్రి ఉత్తమ్‌కు పరామర్శ

జగిత్యాల పట్టణం, న్యూస్‌టుడే: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సోమవారం హైదరాబాద్‌లో కలిసి పరామర్శించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి ఆదివారం మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యుల సంజయ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తలనీలాలు సేకరించుకునే లీజు రూ.1.76 కోట్లు

మల్యాల, న్యూస్‌టుడే: కొండగట్టు ఆంజనేయస్వామి భక్తులు సమర్పించే తలనీలాలను ఏడాదిపాటు సేకరించుకునే లీజు హక్కు కోసం సోమవారం హైదరాబాద్‌లోని దేవాదాయ ధర్మాదాయశాఖ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన టెండర్లలో కేవీఎన్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు రూ.1.76 కోట్లు పాడి సొంతం చేసుకున్నారు. ఈ మేరకు ఆలయ ఈవో రామకృష్ణారావు ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ

జగిత్యాల క్రీడావిభాగం: జగిత్యాల పట్టణంలోని మానస ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి పి.అద్వైత్ రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రజితారావు తెలిపారు.

మల్యాల: రామన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఖోఖో క్రీడలో సత్తాచాటి ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రాజ గోవిందరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయురాలు బాబాలక్ష్మి తెలిపారు. విద్యార్థులు బి.లిఖిత, ఎస్.శ్రీలత, ఎం.కావ్య, ఎస్.కె గోరెమియాలను అభినందించారు.

క్రికెట్ ఎంపిక పోటీలు

జగిత్యాల క్రీడావిభాగం: జగిత్యాల పట్టణంలోని శ్రీవివేకానంద మినీ స్టేడియంలో 14, 17 ఏళ్లలోపు విభాగంలో పాఠశాలల ఎంపిక పోటీలు సోమవారం నిర్వహించినట్లు జిల్లా విద్యాధికారి బి.జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కార్యదర్శి బి.లక్ష్మీరామ్‌నాయక్, పెటా జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, పీడీలు భాస్కర్, అఫ్సర్, భూమేశ్, వినోద్, మహిపాల్, రాజేశ్ పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎం

మెట్‌పల్లి పట్టణం: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకే ఆర్టీసీ డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు డిపో మేనేజర్ దేవరాజ్ తెలిపారు. సోమవారం సాయంత్రం డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో పలువురు ప్రయాణికులు వారి సమస్యలను మేనేజర్ దృష్టికి తీసుకువచ్చారు.

చర్యలు తీసుకోవాలి

కొడిమ్యాల: పంచాయతీ సిబ్బందికి విడుదల చేసిన బకాయిలను దసరా పండగలోపు కార్మికులకు అందేలా చూడాలని సీఐటీయూ నాయకులు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ జిల్లా కన్వీనర్ పుప్పాల శ్రీకాంత్, కో-కన్వీనర్ కోమటి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి పులి మల్లేశం, గర్వందుల రమేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు సన్మానం

కొడిమ్యాల: ఐసీడీఎస్ కొడిమ్యాల సెక్టార్ పరిధిలో వయోవృద్ధులకు సన్మాన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు ఉమ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు, గర్భిణులు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశం

జగిత్యాల విద్యానగర్: టామ్‌కామ్ ఆధ్వర్యంలో దుబాయిలో డెలివరీ బాయ్ ఉద్యోగాల భర్తీకి అవకాశం ఉందని జిల్లా ఉపాధి కల్పనాధికారి బి.సత్యమ్మ సోమవారం తెలిపారు. 21 నుంచి 40 ఏళ్ల వయసు కలిగి, ద్విచక్రవాహన డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారు అర్హులని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు టామ్‌కామ్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ముగిసిన యజ్ఞం

జగిత్యాల విద్యానగర్: జగిత్యాల పట్టణ శివారులోని శ్రీగుట్ట రాజేశ్వర స్వామి దేవస్థానం వద్ద విశ్వగాయత్రి పరివార్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సామూహిక శ్రాద్ధ కర్మల యజ్ఞం సోమవారం ముగిసింది. తాళ్ల లక్ష్మీరాజం, కొమురవెల్లి లక్ష్మీనారాయణ, కనపర్తి నాగభూషణం, శ్రీనివాస్, రాజు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఖాదీ వస్త్రాల ప్రదర్శన

మెట్‌పల్లి పట్టణం: గాంధీ జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని లయోలా డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో స్వదేశీ స్ఫూర్తితో బాపు దివాస్ వేడుకలను నిర్వహించారు. కేవీఎస్వీ లంకమనోజ్ ప్రోత్సాహంతో మెట్‌పల్లి ఖాదీపై యువతకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఆవరణలో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేయగా ప్రిన్సిపల్ ఎన్‌బీ.బాబాతోపాటు ఖాదీ బోర్డు ఛైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్‌రావులు ప్రారంభించారు. ఖాదీ మేనేజర్ గుర్రాల మాధవ్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవా

మెట్‌పల్లి పట్టణం: మెట్‌పల్లి పట్టణంలోని పలు ప్రాంతాలలో బల్దియా అధికారులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి తదితర చోట్ల స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించి పరిసరాలను శుభ్రం చేశారు. బల్దియా కమిషనర్ మోహన్, డిపో మేనేజర్ దేవరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, విష్ణు, ముజీబ్, నిజాం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే నుంచి తప్పించండి

జగిత్యాల ధరూర్‌క్యాంపు: రాష్ట్రప్రభుత్వం డిజిటల్ క్రాప్‌సర్వే విధుల నుంచి తమను తప్పించాలని కోరుతూ జిల్లాలోని ఏఈవోలు జిల్లా వ్యవసాయాధికారిణి బి.వాణికి సోమవారం జగిత్యాలలో వినతిపత్రం ఇచ్చారు. ఏఈవోల సంఘం జిల్లా నాయకులు శ్రీనివాస్, సురేందర్ నాయక్, అక్షయ్, గంగాధర్, నరేశ్, శేఖర్, భూమేశ్, మంజుల, శివలీల, ఫాతిమా, అశ్విని తదితరులు పేర్కొన్నారు.

నిధుల మంజూరుకు కలెక్టర్‌కు ఎమ్మెల్యే లేఖ

జగిత్యాల ధరూర్‌క్యాంపు: జగిత్యాల నియోజకవర్గంలో భారీ వర్షాలతో దెబ్బతిన్న రహదారులు, చెరువు కట్టలు, చెరువుల మత్తడులు, వంతెనల తాత్కాలిక మరమ్మతులకు రూ.కోటికిపైగా నిధులను మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్‌కుమార్ జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్‌కు సోమవారం లేఖరాశారు. ప్రజల ఇబ్బందులను త్వరితంగా తీర్చాలని కోరారు.

ఘనంగా బొడ్డెమ్మ వేడుకలు

ధర్మపురి: పట్టణంలోని బోయవాడలో సోమవారం రాత్రి బొడ్డెమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బొడ్డెమ్మను పురవీధుల్లో ఊరేగించి నదిలో నిమజ్జనం చేశారు. పలువురు కౌన్సిలర్లు, మహిళలు పాల్గొన్నారు. సీఐ రాం నర్సింహారెడ్డి, ఎస్సై మహేష్‌లు బందోబస్తు నిర్వహించారు.

హామీ అమలు చేయాలి

మేడిపల్లి: ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లుగా అర్హులైన రైతులకు రూ.2 లక్షల మేర రుణమాఫీ వర్తింపజేయాలని రైతు ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. మేడిపల్లి, భీమారం మండలాల్లో సోమవారం రైతులను కలిశారు. అక్టోబరు 4న చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.